క్లుప్తంగా

ఘనంగా ఉరుసు ఉత్సవం



ఉరుసు ఉత్సవంలో అర్చకులు, మందిర నిర్వాహకులు

చీపురుపల్లి: శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని రుంకానవీధిలో ఉన్న దత్తసాయి మందిరంలో రాజమండ్రికి చెందిన ముస్లింలతో ఆదివారం సాయంత్రం ఉరుసు(చందనోత్సవం) ఉత్సవం ఘనంగా నిర్వహించారు. దత్తసాయి మందిర నిర్వాహకుడు తంగుడు రామకృష్ణ ఆధ్వర్యంలో షిర్డీ సాయిబాబా విగ్రహానికి చందనం పూయడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే షిర్డీ సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.వేడుకల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు పాల్గొన్నారు.

ఆలయానికి స్టీల్ గేట్ వితరణ



ఆలయానికి స్టీల్‌గేట్ వితరణ చేసిన దాతలు

వేపాడ: పాటూరు గ్రామంలోని పురాతన జనార్దనస్వామి దేవాలయ ముఖ ద్వారానికి గ్రామానికి చెందిన కొట్యాడ శంకరరావు, సత్యవతి దంపతులు స్టీల్ గేట్‌ను వితరణ చేశారు. దాతలకు ఆలయ అర్చకులు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో ద్వితీయ స్థానం



విద్యార్థి శివను అభినందిస్తున్న హెచ్‌ఎం రాము,పీడీ ఉదయ్‌కుమార్

చీపురుపల్లిరూరల్(గరివిడి): రాజమండ్రిలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో గరివిడి మండలం, కాపుశంబాం ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి కిల్లంశెట్టి శివ ద్వితీయస్థానంలో నిలిచాడని ఆపాఠశాల హెచ్‌ఎం డి.రాము తెలిపా రు. విద్యార్థి శివ రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించి రజత పతకం సాధించాడని చెప్పారు. విద్యార్థిని హెచ్‌ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యా యుడు(పీడీ) ఎం.ఉదయ్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



అధికారులతో సమావేశమైన ఎంపీడీఓ తులసీనాథ్

బొండపల్లి: ప్రజాసమస్యల నమోదు, పరిష్కార వేదికలో అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎంపీడీఓ కె.తులసీనాథ్ సూచించారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా చేపట్టాలన్నారు. ఈఓపీఆర్డీ రఘుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల జోలికిపోవద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ లోకేశ్వరరావు

మెరకముడిదాం: భవిష్యత్‌ను నాశనం చేసే మాదకద్రవ్యాల జోలికి పోవద్దని బుధరాయవలస ఎస్‌ఐ జె.లోకేశ్వరరావు యువత, విద్యార్థులకు సూచించారు. మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలు, సైబర్ నేరాలపై సంకల్పం కార్యక్రమంలో భాగంగా శ్యామాయ వలస గ్రామస్తులకు సోమవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ చాలా మంది విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారని, పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని చెప్పారు. విద్యార్థు లు మొబైల్స్‌లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ కాలక్షేపం చేయకుండా శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతాల వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు.

- రైతన్నకు రూపాయి కూడా పెట్టుబడి సాయం అందించని కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా రైతు భరోసా పథకం పేరిట అందిన సాయం



అన్నదాతకు ఆదరణ కరువు

శృంగవరపుకోట: ఆరుగాలం కష్టించి రైతన్నలు చేస్తున్న వ్యవసాయానికి కూటమి సర్కారు నుంచి సాయం కరువయ్యింది. తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీ భవ పథకంలో భాగంగా రైతులకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయంగా అందిస్తామని చెప్పిన చంద్రబాబు గారి మాటలు నీటి మూటలు అయ్యాయి. ఎన్నిక ల్లో గెలవాలన్న లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే సాగు పెట్టుబడి సాయం తామే ఎక్కువ అందిస్తామని ఊరూరా సభల్లో ఊదరగొట్టడమే కాకుండా కూటమి మేనిఫెస్టోలోనూ పేర్కొన్నారు. అధికారం అందుకున్న తర్వాత నిస్సిగ్గుగా అసెంబ్లీ వేదికగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు తాము ఇచ్చేది రూ.14 వేలేనని, కేంద్రం ఇచ్చే రూ.6000 కలిపి రైతుకు రూ.20వేలు ఇస్తామంటూ గొప్పగా చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చి పదినెలలు పూర్తయిపోయినా ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వంరైతులకు రూపాయి కూడా పెట్టుబడి సాయం అందించలేదు. గత ప్రభుత్వంలో క్రమం తప్పకుండా రైతు భరోసా పథకం పేరిట పెట్టుబడి సాయం అందించే వారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన ఖరీఫ్ సీజన్‌లో ఇవ్వాల్సిన సొమ్ము ఎగ్గొట్టారు. రబీ సీజన్ లోనూ ఎగ్గొట్టారు. ప్రస్తుతం రైతాంగం మళ్లీ ఖరీఫ్ సాగుకు సమాయత్తం అవుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌కైనా పెట్టుబడి సాయం ప్రభుత్వం అందిస్తుందో లేదోనన్న అనుమానాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

ఎస్.కోట నియోజకవర్గంలో రైతుల వివరాలు

మండలం	రైతుల సంఖ్య
ఎస్.కోట	4,220
జామి	5,392
వేపాడ	2,723
ఎల్.కోట	4,642
కొత్తవలస	2,183

అన్నదాత ఎదురు చూపులు

ఎస్.కోట నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సుమారు 20వేల మంది రైతులు పది నెలలుగా పెట్టుబడి సాయం కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. నాడు చంద్రబాబు చేసిన ప్రకటన ప్రకారం గత ఖరీఫ్ సీజన్‌కి సుమారు రూ.40 కోట్లు రైతాంగానికి చెల్లించాలి కానీ చిల్లిగవ్వ కూడా ప్రభుత్వం విడుదల చేయలేదు. ఎన్నికలకు ముందు చెప్పిందంతా తూచ్...మేము ఇస్తామన్నది రూ.14 వేలే అని వ్యవసాయశాఖ మంత్రి ప్రకటించిన ప్రకారం చూసినా రూ.28 కోట్లు నియోజకవర్గ రైతాంగానికి ఇవ్వాల్సి ఉంది.

రైతన్నకు భరోసా ఇచ్చిన జగనన్న

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు జగన్ అన్ని విధాలా అండగా నిలిచారు. రైతుభరోసా పథకానికి శ్రీకారం చుట్టి రైతులకు అయిదేళ్ల పాటు క్రమం తప్ప కుండా ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం అందించారు. గ్రామాల్లో సచివాలయాలకు అనుసంధానంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతులకు గ్రామాల్లోనే రైతు భరో సా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించేవారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసి న పంట ప్రకృతి విపత్తుల వల్ల దెబ్బతింటే రైతన్నలు నష్టపోకూడదనే ఉద్దేశంతో ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం ఆ పథకానికి కూడా మంగళం పాడింది.

నిలువునా ముంచేశారు



చంద్రబాబు రైతులని నిలువునా ముంచేశారు. అధికారం కోసం అబద్ధాలు చెప్పి రైతులను మోసం చేశారు. పెట్టుబడి సాయం ఏటా రూ.20వేలు ఇస్తామని చెప్పారు. తర్వాత రూ.14వేలు ఇస్తామన్నారు. ఇప్పుడు ఏదీ చెప్పడం లేదు. అన్నదాత సుఖీభవ అని పేరు మాత్రం గొప్పగా పెట్టారు. సుఖం మాట దేముడు ఎరుగు, రుణం మాత్రం తప్పడం లేదు. ఇప్పటికే ఒక ఖరీఫ్ సీజన్ ఎగ్గొట్టారు. ఈ ఏడాదైనా ఇస్తారో లేదో ఆ దేవుడికే తెలియాలి.

– తూర్పాటి అప్పలరాజు, కళ్లేపల్లి గ్రామం, ఎల్.కోట మండలం

గతప్రభుత్వంలో఼ ఠంఛన్‌గా అందేది



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సాగు పెట్టుబడి సహాయం ఠంఛన్‌గా వ్యవసాయ పనుల ప్రారంభ సమయానికి అందేది. గత ప్రభుత్వం చేసిన సహాయం వేడినీళ్లకు చన్నీళ్లలా పెట్టుబడులకు ఉపయోగపడేవి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు నిరాశే మిగిలింది. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఒక్క రూపాయి సాయం అందలేదు. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నాం. ఈఏడాదైనా ప్రభుత్వం సహాయం అందిస్తే కొంతవరకు అప్పు భారం తగ్గుతుంది. పెట్టుబడులు పెరిగిపోయి, నష్టాలు కష్టాలే మిగులుతున్నాయి. రైతులను ఆదుకునే నాథులే కరువయ్యారు.

– సమ్మంగి దేముడు, రైతు, వేపాడ

బీమా పరిహారం జమచేయడంలో నిర్లక్ష్యం



బాధితురాలు ఈశ్వరమ్మ

విజయనగరం అర్బన్: శాఖల మధ్య నెలకొన్న సమన్వయలోపంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వివరాల్లోకి వెళితే.. వేపాడ మండలం వీలుపర్తి గ్రామానికి చెందిన పర్రి నాయుడుబాబు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకంలో డీఆర్‌డీఏ శాఖ ద్వారా చేరాడు. అనంతరం 2022 అక్టోబర్ 13న ఆయన మృతి చెందడంతో భార్య ఈశ్వరమ్మకు 2024 మార్చి 11న బీమా సంస్థ రెండు లక్షల రూపాయల పరిహారం చెక్ మంజూరు చేసింది. వేపాడలోని విశాఖ గ్రామీణ బ్యాంక్‌లో చెక్ క్లియర్ చేసుకోవాలని అధికారులు సూచించారు. దీంతో ఆమె బ్యాంక్ అధికారులకు చెక్ ఇచ్చి తన ఖాతాకు నగదు ట్రాన్స్‌ఫర్ చేయాలని కోరింది. అయితే అదే బ్యాంక్‌లో ఈశ్వరమ్మ అత్తకు రుణం ఉండడంతో అది తీరిస్తే గాని చెక్ క్లియర్ చేయమని బ్యాంక్ అధికారులు చెప్పడంతో బాధితురాలు ఊసురోమంటూ డీఆర్‌డీఏ అధికారులను కలిసి సమస్య వివరించింది. అయితే బీమా కట్టించడం వరకే మా పని.. బ్యాంకర్లు డబ్బులు ఇవ్వకపోతే మేమేం చేస్తామంటూ వారు బదులిచ్చా రు. నెలల తరబడి తిరుగుతున్నా నగదు జమ కాకపోవడంపై బాధితురాలు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసింది.

బొండపల్లి ఏపీఓగా అరుణ



ఏపీఓ అరుణ

బొండపల్లి: ఉపాధి హామీ పథకం మండల ఏపీఓగా జి.అరుణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె నెల్లిమర్ల మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. అలాగే ఈసీ ఆర్.సన్యాసిరావుకు డెంకాడ మండలానికి బదిలీ అయ్యింది. ఆయన స్థానంలో నెల్లిమర్ల మండలం నుంచి కర్రి కార్తీక్ కుమార్ ఇక్కడికి వచ్చారు.

నేడు వీరాంజనేయస్వామి తీర్థం

గంట్యాడ: మండలంలోని పొల్లంకి గ్రామంలో వీరాంజనేయ స్వామి తీర్థ మహోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటి ప్రతినిధి శ్రీహరి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అలాగే తీర్థం నేపథ్యంలో ఉదయం 9 గంటలకు కబడ్డీ పోటీలు, మధ్యాహ్నం 3 గంటలకు గుర్రాల పరుగు పందాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

యూటీఎఫ్ పోరుబాట

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ పోరుబాట సాగిస్తోంది. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను కలిసి సమస్యలను వివరిస్తున్నారు. అందులో భాగంగానే యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గరివిడి మండలంలోని కాపుశంబాం గ్రామంలో సర్పంచ్ లెంక సుశీల, ఎంపీటీసీ టొంపల సంజీవరావు, నాయకులు లెంక శ్రీరాములు,పైల బలరాం,మాజీ ఎంపీపీ పైల సింహాచలం, విద్యాకమిటీ చైర్మన్ పిన్నింటి శాంతారావుల నివాసాలకు యూటీఎఫ్ ఉపాధ్యాయులు సోమవారం వెళ్లి వినతిపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలన్నింటినీ కొనసాగించాలని, మోడల్ ప్రైమరీ పాఠశాలలను నెలకొల్పాలని, ప్రాథమికోన్నత పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని అన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని, ఉన్నత పాఠశాలల్లో తెలుగు,ఇంగ్లిష్ రెండు మీడియంలను కొనసాగించాలని కోరారు. యూటీఎఫ్ ప్రతినిధులు డి.రాము, సూరి శ్రీనివాసరావు, పెద్ది శ్రీనివాసరావు, చల్లా సింహాచలం, అల్లంశెట్టి నిర్మలకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ చారి

శృంగవరపుకోట: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక అభినయ్ నర్సింగ్‌హోమ్‌లో తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణపై సోమవారం అవగాహన కల్పించారు. గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్త లు, ఆహార నియమాలు, చేయాల్సిన వ్యాయా మాల గురించి గైనకాలజిస్ట్ అపర్ణ వివరించారు. నవజాత శిశువుల సంరక్షణ, బాలింతలు పాటించాల్సిన జాగ్రత్తలు, చిన్నపిల్లలకు ఇవ్వాల్సిన టీకాలు, చిన్నపిల్లలకు సంక్రమించే వ్యాధు లు, వాటి నివారణ మార్గాలను చిన్న పిల్లల వైద్యనిపుణులు కృష్ణకుమారి వివరించారు. మోకాళ్లు, నడుము నొప్పులు, కీళ్ల వాపులు, మధుమేహం, వాటి నివారణకు తీసుకోవాల్సిన వైద్యం, ఆహార నియమాలపై ఎముకుల వైద్య నిపుణుడు చారి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా 113 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు.

వైద్య సేవలపై ఆరా..



రోగులతో మాట్లాడుతున్న ఎన్‌టీఆర్ వైద్యసేవ టీమ్ లీడర్ జనార్దనరావు

గజపతినగరం: స్థానిక ఏరియా ఆస్పత్రిని ఎన్‌టీఆర్ వైద్యసేవ టీమ్ లీడర్ తుంపిల్లి జనార్దనరావు సోమవారం సందర్శించారు. ఆస్పత్రిలో ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా వైద్యం చేయించుకుంటున్న రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. భోజనం సక్రమంగా అందిస్తున్నారా లేదా, బెడ్‌లు, ఇతర సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీష్‌తో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు బాగున్నప్పటికీ రోగులకు అందించే ఆహారం నాసిరకంగా ఉంటున్నట్లు ఫిర్యాదులు అందాయని చెప్పారు. నాణ్యమైన ఆహారం అందించేలా దృష్టిసారించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను కోరారు. సూపరింటెండెంట్ స్పందిస్తూ ఈ విషయమై ఇంతవరకు తమ దృష్టికి ఎవరూ తీసుకురాలేదని ఇక నుంచి ప్రత్యేకదృష్టి పెడతామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆరోగ్యమిత్ర చుక్క పైడిపునాయుడు, తదితరులు ఉన్నారు.

పరీక్షల పరిశీలన



పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: స్థానిక ఉన్నత పాఠశాలలో6,7,8వ తరగతుల విద్యార్థులకు సోమవారం క్లాస్ రూమ్ బేస్డ్ ఎసెస్‌మెంట్ (సీబీఏ)3 పరీక్షలు నిర్వహించారు. ఎంఈఓ బాలభాస్కరరావు పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. అలాగే తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఎస్‌ఏ-2 పరీక్షలను నిర్వహించారు. ఆయన వెంట పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

వేపాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ప్రవేశాలు ప్రారంభించామని ప్రిన్సిపాల్ కె.అప్పారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలోఎంపీసీ, హెచ్‌ఈసీ గ్రూపులున్నాయని, 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి కొత్తగా బైపీసీ కోర్సు అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. పదోతరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల హాల్ టికెట్లు ఆధారంగా తెలుగు,ఇంగ్లిష్ మీడియంలలో ప్రవేశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు, ఎంసెట్‌తో పాటు ఇతర కాంపిటేటివ్ పరీక్షల మెటీరియల్ అందిస్తామని, మధ్యాహ్న భోజన సదుపాయం ఉందని తెలిపారు.

గ్రామసభల్లో చేసిన తీర్మానాల సంగతేంటి..?



నినాదాలు చేస్తున్న నిర్వాసితుల పోరాట కమిటీ కన్వీనర్ జగన్, రైతులు

- పోలవరం ఎడమ కాలువ డిజైన్ మార్చాలని రైతుల డిమాండ్

వేపాడ: పోలవరం ఎడమ కాలువ డిజైన్ మార్చాలని గతంలో గ్రామసభల్లో రైతులు తీర్మానాలు చేశారని, వాటి సంగతి ఏమైందో అధికారులు చెప్పాలని నిర్వాసితుల పోరా ట కమిటీ కన్వీనర్ చల్లా జగన్ కోరారు. కొండగుళ్ల గ్రామంలో పోలవరం ఎడమ కాలువ నిర్వాసిత రైతుల సదస్సు సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా జగన్ మాట్లాడుతూ ఎడమ కాలువ డిజైన్ వల్ల వేలాది మంది రైతులు నష్టపోతున్నారని అన్నారు. ఇది వరకు కలెక్టర్ ఆదేశాలతో గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో కాలువ డిజైన్ మార్చాలని కోరుతూ రైతులు ఏకవాక్య తీర్మానాలు చేశారని, అధికారులు వాటిపై స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ డిజైన్ మార్చడంతో పాటు భూమి కోల్పోయిన రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములకు బదులు భూమి ఇప్పించాలని డిమాండ్ చేశారు.ఈ పోరాటం లో రైతులకు ప్రజాప్రతినిధులు అండగా నిలవాల్సి ఉందన్నారు. 2007లో కాలువ డిజైన్ తయారు చేసినప్పటి భూముల స్థితికి నేటికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. కాలువ పరిధిలో ఉన్న కొన్ని భూము లు తోటలు, మరికొన్ని రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోయాయన్నారు. జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఇటీవల సైనేజ్ 44లో ఎస్.కోట, కొత్తూరు రెవెన్యూ నుంచి 99 సైనేజ్ గుర్ల వరకు భూసేకరణ చేపట్టవద్దని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారని, అలాగే ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కూడా కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, ఎస్.కోట మండలాల రైతులకు అండగా నిలవాలని కోరారు. నిర్వాసితుల పోరాట కమిటీ సభ్యులు రౌతు బాబూరావు, మజ్జి శ్రీను, అర్జునరావు, ఏడువాక అప్పల నాయుడు, మిరపాక రమణ, శిరికి నాయుడుబాబు, బూసర్ల నారాయణమూర్తి, పాత్రుడు, ఏ.అప్పారావు, ఏ.కృష్ణ, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ వినోద్‌బాబు

చీపురుపల్లి: స్థానిక జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసమే ప్రత్యేకంగా బ్రిడ్జి కోర్సు నిర్వహి స్తున్నట్లు ఆకళాశాల ప్రిన్సిపాల్ మద్దలి వినోద్‌బాబు తెలిపారు. సోమవారం ఆ కళాశాలలో విద్యార్థులకు నోట్, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయని, మరోవైపు ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అడ్మిషన్లు తీసు కునే విద్యార్థులకు నోట్, పాఠ్య పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. ప్రథమ సంవత్సరంలోని అన్ని సబ్జెక్టులకు బ్రిడ్జి కోర్సులు నిర్వహిస్తున్నామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం కూడా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అధ్యాపక సిబ్బంది శ్రీను, గణపతి, అనిత, వెంకటలక్ష్మి, లావణ్య, రవికుమార్, సత్యం, ఇందిర, అరుణశ్రీ, జ్యోతి, రామకృష్ణ, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని వినతి



తహసీల్దార్ రాజారావుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

చీపురుపల్లి: రెవెన్యూ వ్యవస్థలో ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న తమకు వేతనాలు పెంచాలని వీఆర్‌ఏలు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎన్.రాజారావు కు మండల వీఆర్‌ఏలు సోమవారం వినతిపత్రం అందజేశారు. వీఆర్‌ఏలు మాట్లాడుతూ రూ.10,500 వేతనంతో కుటుంబాలను పోషించుకోలేక పోతున్నామని, పేస్కేల్ అమలు చేసి కనీసం రూ.26 వేలు వేతనం ఇవ్వాలని అభ్యర్థించారు. వేతనంతో పాటు డీఏ కూడా ఇవ్వాలని, నామినీలను వీఆర్‌ఏలుగా గుర్తించాలని, పదోన్నతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న వీఆర్‌ఏ పోస్టులను భర్తీ చేయాలన్నారు.అలాగే రాత్రి విధులను రద్దు చేయాలని కోరారు. వీఆర్‌ఏలు ఎస్.అనురాధ, దండి సూర్యనారాయణ, బి.మహాలక్ష్మి, సీహెచ్.నాగరాజు, బి.ఆదినారాయణ, ఉప్పాడ అప్పలనరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి పట్టాభిషేకం



శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా బొద్దాం రామాలయంలో సోమవారం రాములవారి పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. పురోహితుడు బొడ్డపాటి హరిశర్మ స్వామివారికి పట్టాభిషేకం చేసి, శివలింగానికి అభిషేకాలు చేశారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం సీతారామలక్ష్మణులను ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళల కోలాటంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. – వేపాడ

బైపాస్ రోడ్డు సర్వే పనుల అడ్డగింత



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

శృంగవరపుకోట: పెందుర్తి నుంచి బొడ్డవర వరకు చేపడుతున్న 516-బి జాతీయ రహదారి నిర్మాణంలో బైపాస్ రోడ్డుకు సంబంధించి సిబ్బంది సోమవారం చేపట్టిన సర్వే పనులను సీపీఎం నాయకుల నేతృత్వంలో రైతులు అడ్డుకున్నారు. సీపీఎం నేత మద్దిల రమణ మాట్లాడుతూ రైతులు అభివృద్ధికి వ్యతిరేకం కాదని అన్నారు. బైపాస్ రోడ్డులో భూములు కోల్పో తున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూమి విలువకు నాలుగు రెట్ల పరిహారం చెల్లించాలని కోరారు. ఇదివరకు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించగా, పరిహారం కోసం ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని, బ్రిటిష్ మ్యాపింగ్ ప్రకారం పెందుర్తి- బొడ్డవర రోడ్డు 180 అడుగుల వెడల్పులో ఆక్రమణలు తొలగించి, అభివృద్ధిలో ఉన్న అడ్డంకులను క్లియర్ చేయాలని తహసీల్దార్‌కు కలెక్టర్ సూచించారని గుర్తు చేశారు. కలెక్టర్ హామీ, ఆదేశాలను ఏమీ అమలు చేయకుండా, రైతులు, నాయకులకు చెప్పకుండా సర్వే పనులు ఎలా చేస్తారంటూ సిబ్బందిని నిలదీశారు. ఇప్పటికే అభివృద్ధి నిమిత్తం రైతుల భూములు దోచుకుంటున్నారని, ఇదే విధానం కొనసాగితే జరగబోయే పరిణామాలకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అనంతరం నాయకులు, రైతులు తహసీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు, రైతులు ముత్యాల నాయుడు, స్వామినాయుడు, కె.సూర్యం, వై.రాంబాబు, వై.దేముడు, పి.రమణ, వై.ఆనంద్, వై.ఈశ్వరరావు, కె.అప్పలనా యుడు, బి.కృష్ణ, కె.నాగమణి, సీహెచ్.శంకరరావు, సీహెచ్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



కొత్తవలస: వియ్యంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, విద్యార్థులు



దత్తిరాజేరు: కె.కొత్తవలసలో ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది



గంట్యాడ: గంట్యాడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని వైద్యాధికారులు సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కొత్తవలస మండలంలోని వియ్యంపేటలో, దత్తిరాజేరు మండలంలోని కె.కొత్తవలస, గంట్యా డ మండల కేంద్రంలో అక్కడి పీహెచ్‌సీల వైద్య సిబ్బంది సోమవారం ర్యాలీలు నిర్వహించారు. వియ్యంపేట, కె.కొత్తవలస పీహెచ్‌సీల వైద్యాధికారులు గోపాలకృష్ణ, కె.రఘు గంట్యాడ పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ కె.ఎర్రన్న మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నారు. కుటుంబంలో అందరూ ఆరోగ్యంగా ఉంటే నే ఆ కుటుంబం సంతోషంగా ఉంటుందన్నారు.ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు, మంచి నిద్ర అవస రమని, యోగా, వ్యాయామం చేయాలన్నారు.

– కొత్తవలస/దత్తిరాజేరు/ గంట్యాడ